క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలను సమర్థంగా నిర్వహించాలి



పాతపాడు(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సమర్థంగా నిర్వహించాలని పాతపాడు గ్రామ సర్పంచి దేవగిరి సుజాత సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి అందచేస్తున్న మొబైల్ ఫోన్లను శనివారం పాతపాడు గ్రామ సర్పంచి సుజాత వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి అందచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవగిరి ఓంకార్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు పాల్గొన్నారు.

ఖాదీ మహోత్సవ్ ప్రదర్శన



పెనమలూరు: ఖాదీ మహోత్సవ్ సందర్భంగా కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు శనివారం ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా డీన్ బావినేని పాండురంగారావు మాట్లాడుతూ స్థానికంగా చేతి వృత్తుల వారు తయారు చేసే ఖాదీ, ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయటం ద్వారా వారిని ప్రోత్సహించటమే కాకుండా, జీవనోపాధి కల్పించవచ్చని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయండి



నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహించే సామాజిక తనిఖీల్లో రైతులకు చెందిన వ్యవసాయ భూముల్లో పొరపాట్లను సరిదిద్దుకోవచ్చునని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అన్నారు. శనివారం నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామంలోని రైతులకు చెందిన వ్యవసాయ భూముల జాబితాను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ కార్యక్రమంలో వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో వరి మాగాణితో పాటు ఇతర పంటల భూముల వివరాలను ప్రకటించారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన వివరాలను రైతులు పరిశీలించుకొని ఎలాంటి పొరపాట్లున్నా వాటిని 30వ తేదీలోపు వ్యవసాయ శాఖ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లి సరిచేసుకోవచ్చునన్నారు. వ్యవసాయ శాఖ అసిస్టెంటు మౌనిక మాట్లాడుతూ గ్రామంలో 780 మంది రైతులకు సంబంధించి 2,918 ఎకరాల వ్యవసాయ భూములున్నాయన్నారు. ఎలాంటి తప్పులున్నా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానంద రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కులోన్మాదుల కుట్రలు ఇక సాగవు

కంకిపాడు: తప్పులను ఎత్తి చూపిస్తే చంపేందుకు పథకాలను రచిస్తున్నారని, చంద్రబాబు కులోన్మాదులు సాగిస్తున్న కుట్రలు ఇక సాగవని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, సీహెచ్‌సీ చైర్మన్ మేడం ద్రావు కుటుంబరావుతో కలిసి శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుపై ఖమ్మంలో హత్యకు చంద్రబాబు కులోన్మాదులు కుట్ర పన్నటాన్ని ఖండించారు. ఖమ్మం పోలీసులు సమగ్ర విచారణ జరిపి అంబటిపై జరిగిన దాడి ఘటనను ఛేదించి, వాస్తవాలను వెలికితీయాలన్నారు. ఎల్లో మీడియా తప్పుడు రాతలను నమ్మే పరిస్థితుల్లో జనం లేరని స్పష్టంచేశారు.

అందరికీ అందుబాటులో వైద్య సేవలు

జిల్లా వైద్యాధికారి గీతాబాయి

పెనమలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో అన్ని వర్గాల వారికి వైద్య సేవలు అందిస్తున్నామని జిల్లా వైద్యాధికారి గీతాబాయి అన్నారు. యనమలకుదురు రెండవ నంబరు సచివాలయం పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న వైద్య శిబిరాలకు మంచి స్పందన వచ్చిందన్నారు. క్షేత్ర స్థాయిలో సర్వేచేసి వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలలో వైద్య నిపుణులతో పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందచేస్తున్నామన్నారు. దీర్ఘకాలంగా వ్యాధులతో బాధపడే వారికి మెరుగైన వైద్య సేవలు అందించటానికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నామని వివరించారు. సుగర్, బీపీలతో పాటు దీర్ఘకాల వ్యాధులు ఉన్నవారికి భవిష్యత్తులో కూడా ఆయా ప్రాంతాల పీహెచ్‌సీలు, హెల్త్ క్లినిక్‌ల ద్వారా మందులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి బిజిలి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నేతలు మరీదు శ్రీనివాసరావు, ఈడే గోపాలకృష్ణ, వినోద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జేఏఎస్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు: ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. నందమూరు గ్రామ సచివాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. శిబిరంలో 852 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో నందమూరు సర్పంచ్ టి.బేబి, బొకినాల సర్పంచ్ పాపారావు, ఎంపీటీసీ సభ్యులు టి.వి.డి.ఎన్ ప్రసాద్, వైద్యులు మల్లికార్జునరావు, బి.వేణుగోపాల్‌రెడ్డి, వి.లావణ్య, కె.వాణి, వి.సుబ్బారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



యనమలకుదురు వైద్య శిబిరంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న గీతాబాయి

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పేదల సంక్షేమం, ప్రజారోగ్యానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పలువురు ప్రజాప్రతినిధులు కొనియాడారు. బాపులపాడు మండలం కోడూరుపాడులో ఆర్సీఎం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో శనివారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వీరవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్మయి నేతృత్వంలోని వైద్యుల బృందం గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 1177 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పీఎస్ఆర్ ప్రసాద్, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి అవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైస్ ఎంపీపీ చందు రమాదేవి, సర్పంచ్ ఆర్నేపల్లి సవిత, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చందు శ్రీనివాసరావు, ఆర్నేపల్లి రవివర్మ, కొలుసు ఏసుబాబు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ప్రభుత్వ వైద్యం

గన్నవరంరూరల్: నాణ్యమైన ఉచిత వైద్య సేవలు ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తుందని ఎంపీపీ అనగాని రవి అన్నారు. కొత్తగూడెం ఎంపీపీ పాఠశాల ఆవరణలో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

సర్పంచ్ తూంపాటి రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ పేద ప్రజల వైద్యానికి భరోసా ఇచ్చి ప్రతి గ్రామంలోనూ నిపుణులైన వైద్యులతో ప్రజలకు వైద్యం అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, ఎంపీటీసీ సభ్యురాలు చిలకపాటి దుర్గ, ఉప సర్పంచ్ దేవరపల్లి రాంబాబు, వీరపనేనిగూడెం సొసైటీ అధ్యక్షుడు బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో సత్యకుమార్, పంచాయతీ కార్యదర్శి బాపూజీ, వైద్య సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే ప్రధానం

రామవరప్పాడు: పేదల ఆరోగ్యమే ప్రధాన ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో బీపీ, సుగర్, సాధారణ వ్యాధులతో పాటుగా చర్మ, దంత, కంటి సంబంధిత వ్యాధులకు సుమారు 700 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రతి గ్రామంలో ప్రతి సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేస్తోందన్నారు. అనంతరం అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాల ఆహార పదార్థాల స్టాల్‌ను పరిశీలించారు. ఈ స్టాల్‌లో మునగాకు చాక్లెట్, నువ్వుల లడ్డు, కరివేపాకుతో తయారు చేసిన పదార్థాలను నేతలు రుచి చూశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సువర్ణరాజు, గన్నవరం మార్కెట్ యార్డు చైర్మన్ అంజనీకుమారి, పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పోషకాహార పదార్థాలను రుచి చూస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్ తదితరులు



కోడూరుపాడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

ఎమ్మెల్యే వంశీ సొంత నిధులతో రహదారుల ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం ఆరుగొలనులోని జగనన్న కాలనీలో అంతర్గత రహదారుల ఏర్పాటును గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చొరవతో చేపట్టారు. ఇటీవల గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే వంశీకి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పూర్తయినప్పటికీ అంతర్గత రహదారులు ఏర్పాటు చేయకపోవటంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నట్లు లబ్ధిదారులు వాపోయారు. దీంతో స్పందించిన ఆయన తన సొంత నిధులతో జగనన్న కాలనీలో అవసరమైన రోడ్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు శనివారం ఆరుగొలను జగనన్న కాలనీలో రోడ్ల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులను గన్నవరం ఏఎంసీ డైరెక్టర్ పసుపులేటి మురళి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చొక్కాపు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా రక్షణ భేరి పోస్టర్ల ఆవిష్కరణ

కంకిపాడు: రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన మతోన్మాద బీజేపీని ఇంటికి సాగనంపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.రంగారావు పిలుపునిచ్చారు. నవంబరు 15న చేపట్టిన చలో విజయవాడ ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ పోస్టర్లను శనివారం కంకిపాడు బస్టాండు ప్రాంగణంలో ఆవిష్కరించారు. నవంబరు 15న చేపట్టిన ప్రజా రక్షణ భేరి సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తాడంకి నరేష్, నాయకులు వి.జాన్‌మోజెస్, ఎం.చంటిబాబు, సీహెచ్‌వీ రెడ్డయ్య, కె.నాంచారయ్య, వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్న పాలనతోనే సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: జగనన్న పాలనతోనే సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని, రానున్న ఎన్నికల్లో ప్రజలు జగనన్నకు అండగా నిలవాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. తాడిగడప 4వ నంబరు సచివాలయం పరిధిలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల వివరాలతో ఉన్న బ్రోచర్‌లు పంపిణీ చేసి, స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్నకు అండగా ఉంటేనే భవిష్యత్తులో కూడా సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.ప్రకాశరావు, జెడ్పీటీసీ బాకీబాబు, తాడిగడప వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, సర్పంచి శ్రీనివాసచౌదరి, వైఎస్సార్ సీపీ నేతలు పోలవరపు బాబీ, గద్దల రాజా, పి.కిషోర్, ఈదా రాజేష్, ముజీబ్, ఖాదర్‌బాషా, వేమూరి బాలకృష్ణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



తాడిగడపలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

రామవరప్పాడు: ఫుట్‌పాత్‌లు ఆక్రమించి పాదచారులు, ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి జయచంద్ర గాంధీ అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో శనివారం డీపీఓతో పాటు అధికారుల బృందం ఫుట్‌పాత్ ఆక్రమణలను పరిశీలించి ఆక్రమణదారులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లపై దుకాణదారులు ముందుకొచ్చి షాపులో సామాన్లతో ఆక్రమించడాన్ని, బండ్లపై వ్యాపారులను నిర్వహించడాన్ని పరిశీలించారు. జయచంద్ర మాట్లాడుతూ ఈ ఆక్రమణలతో ఫుట్‌పాత్‌లపై పాదచారులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దుకాణదారులు శృతిమించి నిబంధనలకు విరుద్ధంగా షాపులో సామాన్లు ఫుట్‌పాత్‌లపై ఉంచుతున్నారన్నారు. ఆక్రమణదారులను హెచ్చరించామని, వెంటనే ఫుట్‌పాత్‌లు ఖాళీ చేయాలని ఆదేశాలు జారీచేసినట్లు వివరించారు. ఈ పరిశీలనలో ఎంపీడీఓ భార్గవి, పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశీలనలో అపశ్రుతి

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ పరిశీలన కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. డీపీఓ కార్యాలయ అటెండర్ విజయ్‌ను జాతీయరహదారిపై లారీ ఢీ కొట్టడంతో గాయాలపాలయ్యారు. వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

గాన చరితుడు ఘంటసాల



విజయవాడ కల్చరల్: గాన చరితుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని విశ్రాంత పోలీసు అధికారి కె.డేవిడ్ రాజు అన్నారు. రమణ కల్చరల్ ఆర్ట్స్, గణేష్ సేవా సమితి, కామ్రేడ్ జీఆర్ పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఘంటసాల అభిమానుల ఆత్మీయ సమావేశం, ఘంటసాల సినీ సంగీత విభావరి కార్యక్రమం గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళా వేదికలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారి గాన చిత్రను చాటి చెప్పిన మహనీయుడు ఘంటసాల మాస్టారు అని అభివర్ణించారు. రమణ కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు మాంతి రమణ మాట్లాడుతూ ఘంటసాలను నేటి గాయనీ గాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పి.శివలీల, రమణపాత్రో, రత్నకుమారి, రూపశ్రీ ఘంటసాల గీతాలను మధురంగా ఆలపించారు. కార్యక్రమంలో రమణ కల్చరల్ ఆర్ట్స్ ఉపాధ్యక్షుడు ప్రభల శ్రీనివాస్, వివిధ సంస్థల ప్రతినిధులు బీవీ వీరభద్రరావు, కొప్పుల ఆనంద్, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

డాగ్ విల్లీ ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): హైదరాబాదుకు చెందిన పెట్‌బోరింగ్ ఫెసిలిటీ డాగ్ విల్లీని పశ్చిమ, పెనమలూరు ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, కొలుసు పార్థసారథి ప్రారంభించారు. గురునానక్ కాలనీలో ఏర్పాటు చేసిన ఈ ఫెసిలిటీ ప్రారంభోత్సవంలో వీరు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఇంటిలోనూ పెంపుడు జంతువులు ఉంటున్నాయని, అత్యవసర పరిస్థితిలో వాటి పెంపకందారులు ఎక్కడికైనా వెళ్తే వాటి సంరక్షణను డాగ్‌విల్లీ చూసుకుంటుందని తెలిపారు. డాగ్‌విల్లీ వ్యవస్థాపకురాలు అమృతవర్షిణి మాట్లాడుతూ తమవద్ద ఉంచిన పెంపుడు జంతువుల పరిమాణం ప్రకారం ప్రత్యేక గదుల్లో ఉంచుతామని, వాటి యజమానులకు సంరక్షణపై వీడియో కాల్‌ద్వారా అందిస్తామని తెలిపారు.

క్రైమ్ కార్నర్

ఇద్దరు విద్యార్థులపై కేసు నమోదు

పెనమలూరు: ఓ విద్యార్థిపై దాడి చేసిన ఇద్దరు విద్యార్థులపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు కాలువ కట్టపై ఉంటున్న టి.ఆనంద్ గంగూరు ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అతను కాలేజీ నుంచి గురువారం సాయంత్రం ఇంటికి వస్తున్న సమయంలో పొరపాటున ఆనంద్ చేతికి తరుణ్ అనే విద్యార్థి నడుపుతున్న బైక్ తగిలి బైక్‌తో సహా తరుణ్ కిందపడిపోయాడు. ఆసమయంలో అక్కడే ఉన్న తరుణ్ మిత్రుడు, సహ విద్యార్థి గురువిందపల్లి చంద్రశేఖర్ ఘటనాస్థలం వద్దకు వచ్చి నీ చేయి తగలటం వలనే తరుణ్ కింద పడిపోయాడంటూ ఆగ్రహంతో ఆనంద్‌పై దాడి చేశాడు. ఈ విషయం ఆనంద్ ఇంటికి వెళ్లి తన తల్లితండ్రులు శివకుమారి, నాగేశ్వరరావుకు చెప్పాడు. ఆనంద్ తల్లిదండ్రులు శుక్రవారం కాలేజీ వద్దకు వచ్చి తమ కుమారుడు ఆనంద్‌పై ఎందుకు దాడి చేశావని చంద్రశేఖర్‌ను ప్రశ్నించారు. దీంతో చంద్రశేఖర్ అతనితో ఉన్న మరో విద్యార్థి ఎం.రాకేష్ మళ్లీ ఆనంద్‌పై దౌర్జన్యం చేసి పోలీసులకు ఫిర్యాదు చేస్తే అంతుచూస్తామని బెదిరించారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా, చంద్రశేఖర్, రాకేష్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: పాత గొడవల కారణంగా ఓ వ్యక్తిపై దాడి చేసిన మరో వ్యక్తిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగూరు ఏఆర్ నగర్‌కు చెందిన కొక్కిలిగడ్డ జోసఫ్‌కు కొమ్మూరి సాయికిరణ్‌కు పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జోసఫ్ కానూరు 100 అడుగుల రోడ్డు వద్ద ఉన్న సమయంలో సాయికిరణ్ వచ్చి తగాదా పడి దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

అత్తింటి వారిపై వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరుకు చెందిన శ్రవణం గాయత్రి 2001లో ఎస్.వాసుదేవశర్మను వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త విదేశాలకు వెళ్లటంతో గాయత్రి తన తల్లిదండ్రులు సుబ్రమణ్యేశ్వరరావు, రమాదేవి వద్ద ఉంటోంది. కొంతకాలం కిందట గాయత్రి ద్వారకా తిరుమల గుడికి వెళ్లిన సమయంలో శ్రవణం లక్ష్మయ్య, కనకదుర్గ దంపతులు పరిచయమయ్యారు. వారి కుమారుడు శ్రవణం ఫణీరంజిత్‌తో గాయత్రికి పరిచయం పెరిగింది. ఇరువురూ 2013 నుంచి సహజీవనం చేయసాగారు. వీరిరువురు వివాహం చేసుకోవటానికి నిర్ణయించుకోవటంతో మొదటి భర్తకు గాయత్రి విడాకులు ఇచ్చింది. 2022లో ఫణీరంజిత్‌ను వివాహం చేసుకుంది. గాయత్రి వద్ద ఆస్తి కాజేసిన ఫణికుమార్ తన తల్లిదండ్రులు కనకదుర్గ, లక్ష్మయ్యతో కలిసి మరో వివాహానికి సిద్ధపడ్డాడు. దీనికి గాయత్రి అభ్యంతరం చెప్పటంతో ఆమెను చంపుతానని బెదిరిస్తున్నాడు. దీంతో బాధితురాలు అత్తింటివారి పై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

కత్తితో బెదిరించిన ముగ్గురు వ్యక్తులపై...

పెనమలూరు: కత్తితో బెదిరించిన ముగ్గురు వ్యక్తులపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పల్లిపేటకు చెందిన తాడిబోయిన రవిశంకర్‌కు అదే ప్రాంతానికి చెందిన కొక్కిలిగడ్డ రాజేష్, నాని, లంకె రాజేష్‌లకు మధ్య ఆటో పార్కింగ్ విషయమై పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆటో వద్దకు పై ముగ్గురు వ్యక్తులు వచ్చి రవిశంకర్‌తో ఘర్షణకు దిగారు. కత్తి తీసుకుని చంపుతానని బెదిరించారు. చుట్టుపక్కల వారు రావటంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తనకు ప్రాణహాని ఉందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి జయంతి

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి ఎంపీడీఓ బి.భార్గవి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఈ శివరామకృష్ణ, ఏఓ ఆనందకుమారి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడాలి



అజ్జంపూడి(గన్నవరం): పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకు రావాలని అజ్జంపూడి గ్రామ సర్పంచి కంచర్ల చిన్నా పిలుపునిచ్చారు. అజ్జంపూడి ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు శనివారం వీఎస్ సెయింట్‌జాన్స్ హైస్కూల్ 2006 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.20 వేల విలువైన నోట్‌బుక్స్, పరీక్ష ప్యాడ్లు, గ్రీన్ బోర్డ్స్, పలు సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల చదువులకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలుస్తుందన్నారు. పూర్వ విద్యార్థులైన జీవన్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, శివ, జయరాజు తమ వంతుగా విద్యార్థులకు తోడ్పాటునందించడం అభినందనీయమన్నారు. అనంతరం గ్రామానికి చెందిన జేవియర్ అందజేసిన 125 కథల పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంఈఓ-2 కె.కమల, హెచ్ఎం పి.రవికుమార్, ఉపాధ్యాయులు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి

కంకిపాడు: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి సూచించారు. ఈఓఆర్‌డీలుగా ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన సీహెచ్ శేఖర్, డి.శివకుమార్, ఇ.మార్కండేశ్వరరావులకు శనివారం ఆత్మీయ వీడ్కోలు సభ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తే ప్రజల మదిలో చిరస్థాయిలో నిలిచి పోతారన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.అనూష, పరిపాలనాధికారి ఉదయభాస్కర్, ఈఓఆర్‌డీ పీఎస్ మైథిలి, మండలంలోని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగోన్నతిపై వెళ్లిన అధికారులను సత్కరిస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ అనూష

కలశంతో ఢిల్లీ పయనం

విజయవాడరూరల్: మేరీ మట్టి-మేరీ దేశ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు విజయవాడ రూరల్ మండలం నుంచి కలశంతో మండల పరిషత్ సిబ్బంది శనివారం దేశ రాజధానికి పయనమై వెళ్లారు. విజయవాడ రూరల్ మండలంలోని 14 గ్రామాల నుంచి సేకరించిన మట్టిని కలశం చేసి ఆ కలశంతో మండల కార్యాలయం నుంచి సిబ్బంది విజయబాబు, నారాయణరావు ఢిల్లీ తీసుకువెళ్లారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఢిల్లీలో ఇండియా గేటు వద్ద అమరులైన సైనికుల జ్ఞాపకార్థం నిర్మించే స్తూపం కోసం ఈ కలశాలను వినియోగించనున్నట్లు ఎంపీడీఓ బి.భార్గవి తెలియజేశారు.

టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి అన్న ప్రసాదం భక్తులకు మరింత చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. దాతలు కోలపల్లి విశ్వక్‌సేన, యశశ్వినిల సహకారంతో ఐదువందల మందికి అన్నప్రసాదాన్ని అందించారు.

మానవ అక్రమ రవాణా నిరోధం అందరి బాధ్యత

పెనమలూరు: మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్ రంగారావు అన్నారు. పెనమలూరు వెలుగు కార్యాలయంలో శనివారం మనుషుల అక్రమ రవాణా నిరోధంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషుల అక్రమ రవాణా ప్రపంచంలోనే అతి పెద్ద నేరమన్నారు. సినిమా అవకాశాలు, ఉద్యోగాలు, విదేశాలలో ఉద్యోగాలు, స్మార్ట్ ఫోన్ వాడకం, ఇంటర్నెట్‌లో స్నేహాలు వలన అమ్మాయిలు మోసపోతున్నారని తెలిపారు. దీని నివారణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రజల్లో కూడా మనుషుల అక్రమ రవాణాపై అవగాహన పెరగాలని సూచించారు. సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ మాట్లాడుతూ పిల్లల శ్రమ దోపిడీ, అవయవాల దోపిడీ జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికైనా సమస్యలు తలెత్తితే 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సమాచారం చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం గోవిందరాజు, సంస్థ ప్రతినిధులు సురేష్‌కుమార్, శివ, సీసీ ఝాన్సీ, సునీత, దాసు, వీఓఏలు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.